సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం ¦ 12 ¦ మార్చి ¦ 2024



'రోజా' ప్రయోజనాలెన్నో..
పవిత్రతకు ప్రతిరూపమైన రంజాన్ మాసం నేటి నుంచి ప్రారంభం కానుండగా, ముస్లిం లు ఉపవాస దీక్షలకు సిద్ధమయ్యారు. 8లో



రేషన్ బియ్యం పట్టివేత
రెండు రోజుల క్రితం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు ఆల స్యంగా కేసు నమోదు చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
37° / 22°
వాతావరణం
జిల్లాలో మంగళవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ప్రారంభమై మధ్యాహ్నానికి పెరుగు తుంది. రాత్రి వాతావరణం చల్లగా ఉంటుంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (మంగళవారం సా॥) 6.24
సహర్ (బుధవారం ఉ॥) 4.57

ప్రజాప్రభుత్వానికి పునాది ఇక్కడే..



ఇందిరమ్మ ఇళ్ల పథకం సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, వేదికపై డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, తుమ్మల, కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్, సీతక్క, పొన్నం, శ్రీధర్‌బాబు, సురేఖ, ఎమ్మెల్యేలు కనకయ్య, రాగమయి, కూనంనేని, వెంకట్రావు, పాయం, రాందాస్, కలెక్టర్ ప్రియాంక తదితరులు

బీఆర్‌ఎస్‌ను ఈ గడ్డ ఎన్నడూ నమ్మలేదు

- ఖమ్మం రుణాన్ని కాంగ్రెస్ తీర్చుకుంటోంది
- మా ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాకు పెద్దపీట
- లోక్‌సభ ఎన్నికల్లో బలరాంనాయక్‌ను గెలిపించండి
- మణుగూరు ప్రజాదీవెన సభలో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలు తమ చెమటను రక్తంగా మార్చి కష్టపడడం వల్లే జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాల్లో ఎనిమిది చోట్ల కాంగ్రెస్, కొత్తగూడెంలో కాంగ్రెస్ బలపర్చిన సీపీఐ విజయం సాధించాయని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మణుగూరులో సోమవారం జరిగిన ప్రజా దీవెన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నేతలపై అక్రమంగా కేసులు పెట్టి, కార్యకర్తలను జైళ్లలో బంధించినా ఇక్కడి పార్టీ శ్రేణులు కాంగ్రెస్ జెండాను వదలలేదన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ మాయమాటలను నమ్మని గడ్డగా ఉమ్మడి ఖమ్మం జిల్లా నిలిచిందని, అందుకే గత మూడు ఎన్నికల్లో ఆ పార్టీకి ఇక్కడ గెలుపు దక్కలేదని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీని వంద అడుగుల గొయ్యి తీసి పాతింది ఈ జిల్లానేనని చెప్పారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు కావడానికి తొలి అడుగులు ఇక్కడే పడ్డాయని గుర్తు చేశారు. అందువల్లే ఈ గడ్డ రుణం తీర్చుకునేందుకు తొమ్మిది మంది ఎమ్మెల్యేలు గెలిస్తే ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చామని తెలిపారు. అలాగే, రెండు రాజ్యసభ స్థానాల్లోనూ ఒకటి జిల్లాకు చెందిన రేణుకాచౌదరికి పార్టీ అధిష్టానం కేటాయించిందని పేర్కొన్నారు. 2007 నుంచి అనేక సార్లు ఇక్కడికి వచ్చానని, ప్రతీసారి ఈ జిల్లా తనకు అండగా నిలిచిందని రేవంత్‌రెడ్డి తెలిపారు.



ఇందిరమ్మ ఇళ్ల పథకం లోగో, నమూనాను విడుదల చేస్తున్న సీఎం, మంత్రులు

ఇచ్చిన మాట తప్పం..

తొలిదశ తెలంగాణ ఉద్యమం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పాల్వంచలో 1969లో మొదలైందని, ఆ తర్వాత తెలంగాణ ఆకాంక్ష నెరవేరని కోరికగానే మిగిలిపోయిందని రేవంత్‌రెడ్డి అన్నారు. 2004లో కరీంనగర్ సభలో తెలంగాణ ఏర్పాటుకు తాము సుముఖంగా ఉన్నామని సోనియాగాంధీ ప్రకటించారని, ఆ మాట మేరకే ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారని చెప్పారు. ఈ ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలను సోనియా గాంధీ ప్రకటించగా.. ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ఐదో పథకాన్ని భద్రాచలంలో ప్రారంభించామని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతీ గడపకు వెళ్లాలని, సోనియాగాంధీ ఇచ్చిన హామీలను ఎలా అమలు చేస్తున్నామో చెప్పాలని పిలుపునిచ్చారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరారు. గోదావరి కరకట్ట నిర్మాణం, పులుసుబొంత, సీతారామా ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

సీఎం రేవంత్‌కు కలెక్టర్ స్వాగతం

భద్రాచలంఅర్బన్ : ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభోత్సవానికి సోమవారం భద్రాచలం వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు ఇతర మంత్రులకు కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ స్వాగతం పలికారు.



సైడ్‌లైట్స్

- సీఎం తన ప్రసంగం ప్రారంభించే ముందు 'ఈరోజు పెళ్లి కొడుకు ఈయనే' అంటూ బలరాంనాయక్‌ను సభకు పరిచయం చేశారు.
- రేవంత్‌రెడ్డి హెలీకాప్టర్ వెళ్లే సమయం అవుతుండటంతో మంత్రి తుమ్మల క్లుప్తంగా జై కాంగ్రెస్ అనే నినాదంతో ప్రసంగాన్ని ముగించారు.
- సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చేందుకు వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ తన సతీమణితో వేదికపైకి రాగా సెక్యూరిటీ అడ్డుకున్నారు. దీన్ని గమనించిన రేవంత్‌రెడ్డి సిబ్బందిని వారించి రాందాస్ దంపతులను దగ్గరకు పిలిపించుకున్నారు.
- ప్రజాదీవెన సభావేదికపై ఉన్న సీఎం రేవంత్‌రెడ్డికి అభివృద్ధి ప్రతిపాదనలు అందించేందుకు ఎమ్మెల్యేలు పోటీపడ్డారు. ఈక్రమంలో ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు పలుమార్లు ప్రయత్నించగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. మూడుసార్లు ప్రయత్నించి విఫలమైన దమ్మాలపాటి నాలుగోసారి ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి వినతిపత్రం అందించారు.
- కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరీ సభకు హాజరైనా ప్రసంగించలేదు.
- గిరిజన సంప్రదాయ కొమ్ముపాగాను సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే పాయం ధరింపచేశారు.

మంత్రులు ఏమన్నారంటే..



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం/బూర్గంపాడు: భద్రాచలంలో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభంతో పాటు మణుగూరులో నిర్వహించిన ప్రజాదీవెన బహిరంగసభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, తుమ్మల తదితరులు మాట్లాడారు. ఆయా సభల్లో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ, రాందాస్‌నాయక్, రాగమయి, తెల్లం వెంకట్రావు, కూనంనేని సాంబశివరావు, నాగరాజు, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, లోక్‌సభ అభ్యర్థి పోరిక బలరాం నాయక్, నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి, బొర్రా రాజశేఖర్, మువ్వా విజయ్‌బాబు, వక్కలగడ్డ సోమచంద్రశేఖర్, నాగా సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

- భట్టి మాట్లాడుతూ రాష్ట్ర సంపదను పెంచి, పేదలకు పంచేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. దశాబ్దకాలంగా ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్న పేదల కలలను సాకారం చేసేందుకు తమ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందని చెప్పారు. ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో వెనక్కు నెట్టిందని విమర్శించారు. ఆ పార్టీ పాలనలో తీసుకొచ్చిన బీటీపీఎస్‌తో ప్రభుత్వంపై ఆర్థికభారం పడుతోందని, సబ్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించడంతో కాలుష్యం పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు.
- రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల బొమ్మను చూపి పేదల కలలను కల్లలు చేసిందని విమర్శించారు. ప్రజల చిరకాల కోరిక అయిన పక్కా ఇళ్ల కల భద్రాచలం సీతరామచంద్రస్వామి సన్నిధిలో నెరవేరిందన్నారు. గ్రామ సభల ద్వారా నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయిస్తామని, ఇందుకోసం ఇప్పటికే నియమావళి జీఓ కూడా సిద్ధమైందని చెప్పారు.
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆరు గ్యారంటీల్లో అతి ముఖ్యమైన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీరాముడి పాదాల వద్ద శ్రీకారం చుట్టడం హర్షణీయమని అన్నారు. శ్రీరాముని దయతో ఈ ప్రాంతానికి విద్య, వైద్యం, సాగునీటి రంగాల అభివృద్ధికి తన వంతు కృషి చేశానని చెప్పారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు.
- పేదల కోసం పనిచేసే ప్రభుత్వం తమదని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని వాటిని కూడా అమలు చేస్తున్నామని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ రోజురోజుకూ ఖాళీ అవుతోందని, లోక్‌సభ ఎన్నికల్లో 14 స్థానాల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ అభ్యర్థిగా బలరాం నాయక్‌ను గెలిపించాలని కోరారు.
- మంత్రి సీతక్క మాట్లాడుతూ.. తమది పేదల, మహిళల పక్షపాత ప్రభుత్వమని అతి తక్కువ కాలంలో నిరూపించుకున్నామన్నారు. గ్యారంటీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి చూపిస్తామని చెప్పారు.
- భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు హౌసింగ్ శాఖకు జవసత్వాలు నింపుతామన్నారు. పినపాక నియోజకవర్గంలోని సీతారామ, పులుసుబొంత ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.



భద్రాచలం సభకు హాజరైన ప్రజలు

న్యూస్‌రీల్

సింగరేణిలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్



అధికారులతో సమీక్షిస్తున్న సీఎండీ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలోని వివిధ విభాగాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి త్వరగా నోటిఫికేషన్ జారీ చేయాలని సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశించారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఆయన డైరెక్టర్లు, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంస్థలో ఖాళీగా ఉన్న 279 పోస్టులను ప్రత్యక్ష నియామకాల ద్వారా, 1,073 పోస్టులను అంతర్గత నియామకాల ద్వారా భర్తీ చేయాల్సి ఉందని వివరించారు. ఈ మేరకు విభాగాల వారీగా నోటిఫికేషన్లు విడుదల చేయాలని సూచించారు. సమావేశంలో డైరెక్టర్లు వీ.కే.శ్రీనివాస్, డి.సత్యనారాయణరావు, జి.వెంకటేశ్వరరెడ్డి, అధికారులు కె.బసవయ్య, బి.హన్మంతరావు, టి.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జేఎల్‌ఎంల ఎంపిక ప్రక్రియ పూర్తి



స్తంభం ఎక్కే పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థి

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి జిల్లాకు సంబంధించి జూనియర్ లైన్‌మెన్ల ఎంపిక ప్రక్రియ సోమవారం ఖమ్మంలోని ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఆపరేషన్స్ కార్యాలయంలో నిర్వహించారు. ఆరో దశ నియామకాల్లో భాగంగా ఉమ్మడి ఖమ్మంలోని తొమ్మిది మందికి కాల్ లెటర్లు పంపించగా, అందులో ఓ అభ్యర్థి మరణించటంతో ఎనిమిది మంది హాజరయ్యారు. ఎంపిక కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఎస్ఈ ఏ.సురేందర్‌తో పాటు ఇతర అధికారులు అభ్యర్థుల ధృవీకరణ పత్రాలను పరిశీలించి స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహించారు. ఇందులో ఏడుగురే ఉత్తీర్ణత సాధించారు.

ఆర్టీసీకి శివరాత్రి ఆదాయం రూ.19 లక్షలు

ఖమ్మం మామిళ్లగూడెం: మహాశివరాత్రి సందర్భంగా వివిధ ప్రాంతాల్లో జరిగిన జాతరకు 68 ఆర్టీసీ బస్సులు నడిపించగా ఖమ్మం రీజియన్‌కు రూ.19,37,470 ఆదాయం నమోదైంది. ఈమేరకు వివరాలను ఆర్ఎం సీహెచ్.వెంకన్న వెల్లడించారు. ఖమ్మం డిపో నుంచి తీర్థాల జాతరకు 25 బస్సులు నడపగా రూ.4,75,515, మధిర డిపో నుంచి స్నానాల లక్ష్మీపురానికి నడిపించిన ఏడు సర్వీసుల ద్వారా రూ.1,94,690, సత్తుపల్లి డిపో నుంచి నీలాద్రికి 24 బస్సులు నడపగా రూ.9,42,805, భద్రాచలం నుంచి మోతెగడ్డకు నాలుగు బస్సులు నడపగా రూ.1,59,070, కొత్తగూడెం డిపో నుంచి అన్నపురెడ్డిపల్లికి ఎనిమిది సర్వీసులు నడిపించగా రూ.1,65,390 ఆదాయం వచ్చినట్లు ఆర్ఎం తెలిపారు.

సీఎంపీఎఫ్ క్లెయిమ్‌ల పరిష్కారానికే ఆన్‌లైన్

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు గని కార్మికులకు సంబంధించి సీఎంపీఎఫ్ క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించేందుకు ఆన్‌లైన్ పక్రియ చేపట్టామని రీజియన్ కమిషనర్ హరి పచౌరి తెలిపారు. కొత్తగూడెంలో సోమవారం ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం ఏరియాల సీఎంపీఎఫ్ ఉద్యోగులకు ఒక రోజు శిక్షణ ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా హరి పచౌరి మాట్లాడుతూ క్లెయిమ్‌ల పరిష్కారానికి వచ్చే దరఖాస్తులు, పరిశీలన, పరిష్కారంపై అధికారులకు సూచనలు చేశారు. ఆన్‌లైన్‌లో ప్రతీ ఉద్యోగి వివరాలు నమోదై ఉండడంతో క్లెయిమ్‌ల పరిష్కారం సులువవుతుందని తెలిపారు. ఈ శిక్షణలో జీఎంలు బసవయ్య, హన్మంతరావు, కవితానాయుడు, పర్సనల్ మేనేజర్ ముకుంద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పక్కా నివేదికలతో రండి

- దేవస్థానం అభివృద్ధికి నిధుల సమస్య లేదు
- కరకట్ట పొడిగింపు పనులను వెంటనే ప్రారంభించండి
- అధికారులతో సమీక్ష సమావేశంలో సీఎం

భద్రాచలం : భద్రాచలం అభివృద్ధికి అవసరమైన పక్కా ప్రణాళికలతో నెల రోజుల్లోపు తనకు మంత్రుల ద్వారా అందజేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన భద్రాచలం మార్కెట్ యార్డులో ఇరిగేషన్, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా భద్రాచలం దేవస్థానం, పట్టణ అభివృద్ధిపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, కమిషనర్, ఈఓ అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, స్థానిక మంత్రుల సాయంతో డిజైన్లు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై పక్కా నివేదికలను సిద్ధం చేయాలని చెప్పారు. గత ప్రభుత్వంలా మాటలు, హామీలతో కాకుండా నివేదికలు అందిస్తే అభివృద్ధి చేసి చూపిద్దామని అన్నారు. కూనవరం రోడ్డులో మిగిలి ఉన్న కరకట్ట పొడిగింపు పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. సీతమ్మ సాగర్ బ్యారేజ్ పనులను మేడిగడ్డ తరహాలో నిర్మించొద్దని, దీనిపై మంత్రులు, అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. కాగా ఏన్కూరు వరకు జరిగిన లింక్ కెనాల్ పనుల పెండింగ్ బిల్లులు రూ.460 కోట్లు ఉన్నాయని, అవి మంజూరైతే ఇతర పనులు వేగవంతం అవుతాయని అధికారులు సీఎం దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించారు. వచ్చే జూన్, జూలై వరకు ప్రజలకు తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, ఉత్తమ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న సీఎం

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారిని సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. వారికి దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్, ఆలయ ఈఓ రమాదేవి, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా ధ్వజస్తంభం వద్ద మొక్కిన సీఎం..ఆ తర్వాత సంప్రదాయ దుస్తులతో అంతరాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఏప్రిల్ 17న జరుగనున్న శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు.



అభయాంజనేయస్వామి వారిని దర్శించుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

రవాణా రంగంలో మరో మలుపు

- జిల్లాకు రెండు రైల్వే గూడ్స్ షెడ్లు
- నేడు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధాని

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రవాణా రంగంలో జిల్లాకు రెండు వరాలు దక్కాయి. జిల్లాలో టెర్మినల్ రైల్వే స్టేషన్లుగా ఉన్న మణుగూరు, భద్రాచలంరోడ్ (కొత్తగూడెం) స్టేషన్లకు గూడ్స్ షెడ్లు మంజూరయ్యాయి. ఈ షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్రమోడీ మంగళవారం వర్చువల్‌గా చేపట్టనున్నారు. ఇందుకోసం మణుగూరు స్టేషన్‌లో ఏర్పాట్లు చేపట్టారు. ప్రధాని మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశవ్యాప్తంగా రూ.85 వేల కోట్ల విలువైన పనులకు నేడు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేపడుతుండగా అందులో జిల్లాకు సంబంధించి మణుగూరు, భద్రాచలంరోడ్ రైల్వే స్టేషన్లలో గూడ్స్ షెడ్లు ఉన్నాయి.

గతంలో ఉండగా..

భద్రాచలం రోడ్ స్టేషన్ ఆరంభమైన కొత్తలో ధాన్యం, ఎరువులు ఇతర సరుకుల రవాణాకు గూడ్స్ షెడ్ ఉండేది. కాలక్రమంలో దాన్ని రద్దు చేశారు. సమీపంలో వరంగల్, ఖమ్మం రైల్వేస్టేషన్ల లోనే గూడ్స్ షెడ్లు ఉన్నాయి. ఎరువులు, ధాన్యం రవాణా విషయంలో ఈ రెండు స్టేషన్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. ప్రస్తుతం పెరిగిన అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్తగూడెం, మణుగూరుకు రైల్వే శాఖ గూడ్స్ షెడ్లను మంజూరు చేసింది. ఈ షెడ్లు అందుబాటులోకి వస్తే జిల్లాలో పండించే వ్యవసాయ ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు చౌకగా రవాణా చేసే వెలుసుబాటు కలుగనుంది.

'లిఫ్ట్'ల పునరుద్ధరణ ఎప్పుడో?

- జిల్లాలో 111 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు
- ఇందులో పనిచేస్తున్నవి 57 మాత్రమే
- ఇకనైనా పునరుద్ధరించాలని రైతుల వేడుకోలు
- రెండు లిఫ్ట్‌లకు నిధులు మంజూరైనా పనుల్లో జాప్యం

పాల్వంచరూరల్: వర్షాలు కురిసినప్పుడు నీరు వృథాగా పోకుండా వాగులు, వంకలపై చెక్‌డ్యామ్‌లు, ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసి, సాగునీరు అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. జిల్లాలో 111 లిఫ్ట్ ఇరిగేషన్ (ఎత్తిపోతల పథకం) ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేసింది. అయితే, అందులో కొన్ని పూర్తిగా పనిచేయకపోవడంతో ఆయకట్టు రైతులు ఇబ్బంది పడుతున్నారు. నిధులు మంజూరు చేసి, వాటికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో నిధులు..

మూతపడిన ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ కోసం గత ప్రభుత్వం 2019లో నిధులు మంజూరు చేసింది. మొత్తం 111 ఎత్తిపోతల పథకాల పరిధిలో ఆయకట్టు 29,088 ఎకరాలు ఉంది. ఇందులో 57 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలు సక్రమంగా, 19 నామమాత్రంగా పనిచేస్తున్నాయి. 36 నిరుపయోగంగా ఉన్నాయి. వీటిలో చర్ల మండలం పెదమిడిసిలేరు, పాల్వంచ మండలంలోని నాగారం, సూరారం ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు గత ప్రభుత్వం 2019లో రూ.29.64 కోట్లు మంజూరు చేసింది. పెదమిడిసిలేరుకు రూ.9.31 కోట్లు కేటాయించగా పనులు పూర్తిచేశారు. నాగారం ఎత్తిపోతల పథకానికి రూ.14 కోట్లు, సూరారంలో రూ.6.33 కోట్లు కేటాయించగా పనులు కొనసాగుతున్నాయి.



బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజరలో మూతపడిన లిఫ్ట్

నాగారం ఎత్తిపోతల పథకాన్ని 1978లో నిర్మించగా.. జగన్నాథపురం, రంగాపురం, నాగారం, సంగం, నారాయణరావుపేట గ్రామాల పరిధిలో 1,808 ఎకరాలకు సాగు నీరు అందుతోంది. సూరారం ప్రాజెక్ట్‌ను 1987లో నిర్మించగా.. దీని కింద సూరారం, బిక్కుతండా, కమ్మరిగూడెం, సోములగూడెం గ్రామాల పరిధిలో 970 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందుతోంది.

పనుల్లో జాప్యం..

నాగారం ప్రాజెక్ట్ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ కిన్నెరసాని వాగు ఒడ్డున పాత లిఫ్ట్ సమీపంలో ఒక బావిని తవ్వి అసంపూర్తి వదిలేశారు. భద్రాచలం ప్రధాన రహదారి వెంట పైపులు వేశారు. 14 కిలోమీటర్ల కాలువ నిర్మించాల్సి ఉండగా కొద్దిదూరం తవ్వి వదిలేశారు. అయితే సూరారం లిఫ్ట్ నుంచి కిన్నెరసాని వాగులో బూడిదనీరు ప్రవహించడంతో లిఫ్ట్ పనిచేయకుండా పోయింది. పునరుద్ధరణ పనుల్లో భాగంగా ప్రధాన పైపులైన్ పనులు మాత్రం పూర్తిచేశారు. ఇంకా పంపుహౌస్, మైనర్ పనులు చేయాల్సి ఉండగా అలాగే వదిలేశారు. దీంతో ఆయకట్టు రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

నాడు ప్రతిపక్ష పార్టీ నేతగా.. నేడు ముఖ్యమంత్రిగా

ఏడాది తర్వాత సీఎం హోదాలో రేవంత్ రెడ్డి



ప్రతిపక్ష పార్టీ నేతగా భద్రాచలంలో మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి (ఫైల్)

భద్రాచలం: జోడో యాత్రలో భాగంగా గతేడాది ఫిబ్రవరి 14న ప్రతిపక్ష పార్టీ నేతగా రేవంత్ రెడ్డి భద్రాచలం వచ్చారు. మళ్లీ ఏడాది తర్వాత సోమవారం ముఖ్యమంత్రి హోదాలో భద్రాచలం వచ్చారు. నాడు ప్రతిపక్ష పార్టీ నేతగా రామాలయంలో పూజల అనంతరం అంబేద్కర్ సెంటర్ వద్ద ప్రసంగించారు. మళ్లీ సీఎం హోదాలో అదే సెంటర్ సమీపంలో ఉన్న మార్కెట్ యార్డులో కాంగ్రెస్ ప్రభుత్వ ఐదో హామీ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించటం విశేషం. జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా రేవంత్ పక్కనే ఉన్న భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రి హోదాలో ఆశీనులు కావడం మరో విశేషం. నాడు భద్రగిరికి అన్యాయమంటూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన హామీలను ఎండగట్టిన రేవంత్ రెడ్డి, నేడు సీఎం హోదాలో ఆ అంశాల్లో ఏ ఒక్కటీ ప్రస్తావించకపోవడంతో స్థానిక ప్రజలు నిరుత్సాహానికి గురయ్యారు.

సైడ్‌లైట్స్

- మధ్యాహ్నం 12:50 గంటలకు సారపాక ఐటీసీలో హెలీకాప్టర్ దిగింది.
- 12:59కు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎంతోపాటు మంత్రులు భద్రాచలం రామాలయానికి చేరుకున్నారు.
- 1:02కు సీఎంకు ఆలయ అర్చకులు పరివట్టం కట్టి, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.
- 1:04కు ధ్వజస్తంభం వద్ద సీఎం పూజల నిర్వహణ
- 1:06కు సంప్రదాయ దుస్తులతో ఆలయంలో సీఎం పూజలు చేశారు.
- 1:13కు లక్ష్మీతయారమ్మ వారి సన్నిధిలో పూజలు, అర్చకుల వేదాశీర్వచనం.
- 1:20కి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ.
- 1: 25కు అభయాంజనేయ స్వామివారిని దర్శించుకున్నారు.
- 1 :34కు దేవస్థానం నుంచి సభా ప్రాంగణానికి బయలుదేరిన సీఎం కాన్వాయ్.
- 1 :36కు మార్కెట్ ప్రాంగణానికి చేరుకున్న సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు
- 1: 50కు సభ మొదలు కాగా, 2:33కు రేవంత్ ప్రసంగాన్ని ప్రారంభించి 2:51కి ముగించారు.
- 2 : 53 గంటలకు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి లబ్ధిదారులకు పత్రాలు అందించారు.
- భోజన విరామం తర్వాత 3:25 నుంచి 3:55 గంటల వరకు అధికారులతో సమీక్ష జరిపారు.
- 4:05కు తిరిగి సారపాక హెలీప్యాడ్‌కు బయల్దేరారు.

– భద్రాచలం అర్బన్

ప్రజాదీవెన సభ సక్సెస్



మణుగూరు ప్రజాదీవెన సభకు హాజరైన కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు



మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బలరాంనాయక్‌ను పరిచయం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మణుగూరు రూరల్ : మండలంలోని ముత్యాలమ్మ నగర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాదీవెన సభ విజయవంతమైంది. సభకు పినపాక నియోజకవర్గంలోని మణుగూరు, అశ్వాపురం, పినపాక, కరకగూడెం, గుండాల, ఆళ్లపల్లి, బూర్గంపాడు మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు ప్రజాదీవెన సభ ఉండగా, ఉదయం నుంచే కార్యకర్తలు, ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. వేలాది మంది వాహనాల ద్వారా సభకు తరలిరావడంతో సభా ప్రాంగణమంతా జాతరను తలపించింది. ప్రజాదీవెన సభలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ప్రసంగంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపింది. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు.

పోలీస్, సీఆర్‌పీఎఫ్ బందోబస్తు

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మణుగూరు ప్రజాదీవెనకు హాజరైన నేపథ్యంలో రెండు రోజుల ముందు నుంచే పోలీస్, సీఆర్‌పీఎఫ్ భద్రతా బలగాలను భారీగా మోహరించారు. గట్టి బందోబస్తు చర్యలు చేపట్టరు. డీఎస్పీ వంగ రవీందర్ నేతృత్వంలో పోలీస్ అధికారులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ ప్రధాన కూడళ్ల, సభా ప్రాంగణం వద్ద తనిఖీలు చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి హెలిప్యాడ్ వద్ద దిగి ప్రజాదీవెన సభకు చేరకునే మార్గంలో గట్టి పహారా కాయడంతో పాటు ప్రసంగం తర్వాత తిరిగి హైదరాబాద్ బయలుదేరే వరకు పోలీసులు పకడ్బందీగా భద్రతా చర్యలు చేపట్టారు.

వేలాదిగా తరలివచ్చిన ప్రజలు

అశ్వాపురం: పినపాక నియోజకవర్గ కేంద్రమైన మణుగూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రజాదీవెన బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు వేలాదిగాద తరలివచ్చారు. నియోజకవర్గంలోని మణుగూరు, పినపాక, కరకగూడెం, అశ్వాపురం, బూర్గంపాడు, గుండాల, ఆళ్లపల్లి మండలాల నుంచి సుమారు 40 వేల మంది సభకు హాజరయ్యారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ప్రత్యేక వాహనాల్లో మణుగూరు బాట పట్టారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు వాహనాల పార్కింగ్, స్థభాస్థలికి రావడానికి ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం 4.20 గంటల ప్రాంతంలో సీఎం రేవంత్‌రెడ్డి హెలీప్యాడ్‌కు చేరుకుని, ప్రత్యేక వాహనంలో స్థభాస్థలికి చేరుకున్నారు. సీఎం రాకతో సభాప్రాంగణం ఒక్కసారిగా హోరెత్తింది. సభలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రసంగం సమయంలో సభికులు కేరింతలతో హోరెత్తించారు. బీఆర్ఎస్ మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుపై విమర్శలు చేసిన సమయంలో ప్రజలు చప్పట్లతో ఆనందం వ్యక్తంచేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో సభకు ఏర్పాట్లు చేశారు. సభలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నియోజకవర్గ సమస్యలను విన్నవించి వినతిపత్రం అందజేశారు. గోదావరి వరద బాధితుల సమస్య, సీతారామ ప్రాజెక్ట్ ద్వారా అశ్వాపురం మండలానికి సాగు నీరు, తదితర సమస్యలను సంబంధిత మంత్రుల ఆధ్వర్యంలో పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

‘ముంపు’ బాధితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

అశ్వాపురం: పినపాక నియోజకవర్గంలో గోదావరి పరీవాహక ప్రాంతంలోని వరద ముంపు ప్రాంతాల ప్రజలకు ఎత్తైన ప్రదేశాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. ప్రజా దీవెన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కరకట్టలు నిర్మించాలన్నారు. ప్రతి ఏడాది వరదలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను శాశ్వతంగా తొలగించాలన్నారు. కరకగూడెం మండలంలో 10 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చే పులుసుబొంత ప్రాజెక్టును నిర్మించాలని, పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలని కోరారు. సీతారామ ప్రాజెక్ట్ ఫేజ్–1లో అశ్వాపురం మండలం బీజీకొత్తూరు పంప్‌హౌస్ ద్వారా లిఫ్ట్ నిర్మించి మండలంలోని 16 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నారు. నియోజకవర్గంలో 42 గొత్తికోయ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ కోరారు. గతంలో ఎంపీగా, కేంద్ర మంత్రిగా మణుగూరులో వంద పడకల ఆస్పత్రి నిర్మించామని, పోడు పట్టాలు ఇచ్చామని గుర్తుచేశారు.



శ్రీరామనవమి తిరుకల్యాణం బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్, తుమ్మల, సురేఖ, కలెక్టర్ ప్రియాంక, ఈఓ రమాదేవి తదితరులు



మహిళల ఆనందోత్సాహం..



భద్రాచలంలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్



ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రియాంక



గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు కనకయ్య, జారె ఆదినారాయణ, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్

‘రోజా’ ప్రయోజనాలెన్నో..

- నేటి నుంచి రంజాన్ నెల ప్రారంభం
- ఉపవాస దీక్షలకు సిద్ధమైన ముస్లింలు



చండ్రుగొండ : పవిత్రతకు ప్రతిరూపమైన రంజాన్ మాసం నేటి నుంచి ప్రారంభం కానుండగా, ముస్లింలు ఉపవాస (రోజా) దీక్షలకు సిద్ధమయ్యారు. చంద్రవంక కన్పించడంతో రంజాన్ మాసం ప్రారంభమైంది. దీంతో సోమవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలతో (తరావీ) నమాజులతో ముస్లిం సోదరులు రంజాన్ మాసానికి స్వాగతం పలికారు. ప్రపంచ మానవాళికి మార్గదర్శకత్వం చూపేందుకు దైవం పంపించిన దివ్యఖురాన్ ఈ మాసంలోనే అవతరించిందని చెబుతారు. ఈ మాసంలో ప్రతి విశ్వాసికి రోజా (ఉపవాసం) విధిగా నిర్ణయించినట్లు, ఉపవాసం కేవలం ముస్లింలకే కాదు సర్వమానవాళికి విధిగా నిర్ణయించినట్లు దైవగ్రంథాలు పేర్కొంటున్నాయి. వేకువజామున సహరీ భుజించిన అనంతరం సూర్యాస్తమయం వరకు ఎవరు నిష్టగా, చిత్తశుద్ధితో ఉపవాసం ఉంటారో వారి పాపాలు హరిస్తాయని మహ్మద్ ప్రవక్త పేర్కొన్నట్లు మత పెద్దలు చెబుతున్నారు.

చెడుకు దూరంగా..

మానసికంగా, శారీరకంగా, నైతికంగా, సామాజిక ప్రయోజనాలు ఉపవాసం(రోజా) ద్వారా కలుగుతాయి. సూర్యోదయం కంటే ముందు నుంచి సూర్యాస్తమయం వరకు దాదాపు 13 నుంచి 14 గంటలపాటు ధర్మసమ్మతమైన ఆహార పానీయాలను సైతం ఉపవాసంలో తాత్కాలికంగా నిషేధించారు. ఫలితంగా మనిషిలో ఓ స్పృహను ఉపవాసం కల్గిస్తుంది. మానసికంగా నియంత్రణ కలుగుతుంది. తద్వార ఓ వ్యక్తిని చెడుల నుంచి మానసికంగా దూరం చేస్తుంది.

తరావీహ్ నమాజులు

రంజాన్ నెలలో ఉపవాసాలకు ఎంత ప్రాముఖ్యతనిస్తారో .. ‘తరావీహ్’ నమాజులకు అంతే ప్రాముఖ్యతనిస్తారు. వీటినే కేవలం రంజాన్ నెలలోనే పఠిస్తారు. ఈ 30 రోజుల్లో ఖురాన్ గ్రంథాన్ని పూర్తిగా చదివేస్తారు. రాత్రి ఇషా వరకు 20 రకాతుల తరావీహ్ నమాజులు పఠిస్తారు. సోమవారం నుంచే మజీదులలో తరావీహ్ నమాజులు ఆచరిస్తున్నారు. ఖురాన్ చదవని వారు రంజాన్ మాసంలో పఠించే తరావీహ్ నమాజులను వింటుంటారు.

శారీరకంగా..

ఉపవాసం మనిషిలో శారీరక ప్రయయోజనాలు కల్గిస్తుంది. యంత్రాలను సైతం కొంత సమయం తర్వాత ఎలా నిలుపుదల చేస్తామో ఆ విధంగా ఓ మనిషి పగటి వేళ ఆహార పానీయాలు తీసుకోవడం నిలిపేయడం ద్వార జీర్ణకోశం బలోపేతం అవుతుంది. ఉదరకోశానికి విశ్రాంతి నివ్వడం ద్వారాశరీరానికి అనారోగ్యం కల్గించే ఆమ్లాలు హరించుకుపోతాయి. జీర్ణశక్తి పెరగడం తోపాటు రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ‘లంకణం – దివ్యఔషధం’అని ఇదే విషయాన్ని ఆయుర్వేదశాస్త్రం కూడా బలపరుస్తోంది.

నైతికంగా..

మనసా వాచా కర్మేణా ఓ వ్యక్తి ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నపానీయాలను దూరంగా ఉంటూ చెడులకు, వ్యసనాలను సైతం అదుపులో ఉంచుకోవడమే నైతికత. తనకు తాను అదుపులో ఉంచుకుని రంజాన్ నెల మొత్తం ఉపవాసాలు ఉండే వ్యక్తికి ఈ నెల రాబోవు 11 నెలలకు శిక్షణ లాంటిది. ఆకలిదప్పుల బాధ తెలవడంతోపాటు పేదలకు ఆదుకునే తత్వం పెంపొందుతుంది.

సామాజికంగా ...

రంజాన్ నెలలో ఒక రూపాయి దానం చేస్తే అందుకు ఏడు వందల రెట్లు పుణ్యఫలం దక్కుతుందని మహ్మద్ ప్రవక్త (స.అ.స.) పేర్కొన్నారు. ఫలితంగా ప్రతి మనిషిని దానధర్మాలు చేయడం కోసం ప్రత్యక్షంగా పోత్సహించడమే ఈ మాసపు లక్ష్యం. శక్తికి మించి దానధర్మాలు చేయాలని ఆదేశించారు. సామాజికంగా, ఆర్థికంగా, నైతికంగా, మానసికంగా ఓ మనిషిని మహాత్ముడిని చేయడమే రంజాన్ నెల లక్ష్యం.

కొత్త ఫార్ములా ప్రకారం నగదు

అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌పాం ఓఈఆర్(నూనె దిగుబడి శాతం) ఫార్ములా పెరిగిన నేపథ్యంలో, పామాయిల్ రైతులకు దాని ప్రకారమే నగదును వారి ఖాతాల్లో సోమవారం జమ చేశారు. ఈ మేరకు ఆయిల్‌ఫెడ్ డివిజనల్ అధికారి ఆకుల బాలకృష్ణ వివరాలు వెల్లడించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు టీఎస్ ఆయిల్‌ఫెడ్ అధికారులు ఇటీవల ఆయిల్‌పాం ఓఈఆర్‌ను 19.02 శాతం నుంచి 19.17 శాతానికి పెంచారని తెలిపారు. పెరిగిన ఫార్ములా గతేడాది నవంబర్ నుంచి అమల్లోకి రాగా, నాటి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు మిగిలిన నగదును ఆయా రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు.

పాలేరు నీటి తరలింపునకు రైతుల యత్నం

కూసుమంచి: పాలేరు రిజర్వాయర్ నుంచి కొందరు రైతులు అక్రమంగా తమ పొలాలకు తరలించే ప్రయత్నం చేస్తుండగా జలవనరులశాఖ అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన కొందరు రైతులు నవోదయ విద్యాలయ వెనుక ఉన్న పొలాలలు, బావులకు రిజర్వాయర్ నీటిని తరలించేందుకు సోమవారం పొక్లెయినర్‌తో కాల్వ తవ్వకం మొదలుపెట్టారు. దీంతో జలవనరులశాఖ అధికారులు అడ్డుకుని పొక్లెయినర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించారు. రైతులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రూ.10 వేలు లంచం తీసుకున్నారు

ఎస్‌ఐపై సిమెంట్ వ్యాపారి ఆరోపణ

ములకలపల్లి: సిమెంటు లారీల విషయమై ములకలపల్లి ఎస్సై రాజమౌళి రూ.10 వేలు లంచం తీసుకున్నారని వ్యాపారి నాగుబండి సందీప్ ఆరోపించాడు. స్థానిక వ్యాపారులతో కలిసి సోమవారం సాయిబాబా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించాడు. ములకలపల్లికి చెందిన కొందరు సీసీ రోడ్ల నిర్మాణానికి తన వద్ద రెండు లారీల సిమెంటు కొనుగోలు చేశారని తెలిపారు. ఓ వ్యక్తి ఫోన్లో ఫిర్యాదు చేయగా, ఆదివారం ములకలపల్లికి వచ్చిన లారీలను స్టేషన్‌కు తరలించారని తెలిపాడు. సిమెంట్ కొనుగోలు, అమ్మకానికి సంబంధించి అన్నిరకాల పత్రాలు చూపించినా సుమారు మూడు గంటలపాటు స్టేషన్‌వద్దే ఉంచారని ఆరోపించాడు. చివరకు రూ.10 వేలు లంచం ఇస్తే లారీలను వదిలారని, ములకలపల్లిలోని ఓ పెట్రోల్‌బంక్‌కు చెందిన వ్యక్తికి రూ.10 వేలు ఫోన్‌పే చేసినట్లు సందీప్ తెలిపాడు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు. లంచం తీసుకున్న వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు సరాటి ప్రసాద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎస్సై రాజమౌళిని వివరణ కోరగా.. అవన్నీ అసత్యపు ఆరోపణలేనని పేర్కొన్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత

ఆలస్యంగా కేసు నమోదు

నవభారత్: రెండు రోజుల క్రితం అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు ఆలస్యంగా సోమవారం కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఈ నెల 9న రాత్రి సమయంలో డీసీఎం వ్యాన్‌లో 50 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా కొత్తగూడెం హనుమాన్ బస్తీ సమీపంలోని ఎస్‌కేటీ అపార్టుమెంట్ వద్ద త్రీటౌన్ పోలీసులు పట్టుకున్నారు. ఆ వాహనాన్ని స్టేషన్‌కు తరలించలేదని, సీజ్ చేయలేదని, పలువురు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై సివిల్‌సప్లై డీటీ సుంకరి శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. డీసీఎంలో తరలిస్తు న్న 50 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టుకున్నట్లు, త్రీటౌన్ పోలీసులు సమాచారం ఇచ్చారని, నిందితులపై కేసు నమోదు చేశారని తెలిపారు. రేషన్‌బియ్యం పట్టుకున్న రెండు రోజుల తర్వాత కేసు నమోదు చేయడంపై స్థానికుల నుంచి పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



యువకుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న సీఐ రాజువర్మ

చర్ల: మండలంలోని తేగడ గ్రామానికి చెందిన యువకుడు మాది ప్రదీప్ ఇటీవల తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. అనంతరం సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ చేపట్టి, సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి సోమవారం బాధతుడికి అప్పగించినట్లు సీఐ ఏ.రాజువర్మ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

అశ్వారావుపేటరూరల్: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని నారాయణపురం గ్రామ సమీపంలో పెదవాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా అశ్వారావుపేట వద్ద పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన ట్రాక్టర్లను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీరాముల శ్రీను తెలిపారు.

మహిళను బలిగొన్న అతివేగం

కారు ఢీకొని చికిత్స పొందుతున్న మహిళ మృతి

కొత్తగూడెంఅర్బన్: కారును అతివేగంగా నడిపి మహిళ మృతికి కారణమయ్యాడో వ్యక్తి. ఈ సంఘటనపై కొత్తగూడెం త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం .. భద్రాచలానికి చెందిన ఎం.మణికంఠ గత బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి భద్రాచలం వెళ్తున్నాడు. అదే సమయంలో కొత్తగూడెంలోని ప్రగతినగర్‌కు చెందిన పొగాకు సాయినిఖిల్, తన నాలుగేళ్ల కూతురు, తల్లి హైమావతి(56)లతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. మణికంఠ కారును అతివేగంగా నడుపుతూ కొత్తగూడెం గణేష్‌టెంపుల్ ఏరియాలో వారిని ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై హైమావతి స్పృహ కోల్పోయింది. సాయినిఖిల్‌కు గాయాలయ్యాయి. హైమావతిని చికిత్స నిమిత్తం కొత్తగూడెం, ఖమ్మం ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎక్కడ కూడా చేర్చుకోలేదు. దీంతో తిరిగి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో హైమవతికి మెరుగైన వైద్యం కోసం వరంగల్ తరలించగా, అక్కడి వైద్యులు కూడా భరోసా కల్పించకపోవడంతో తిరిగి కొత్తగూడెం ఆస్పత్రికి తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ ఆదివారం హైమావతి మృతి చెందింది. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం ఆమెది. మృతురాలి కుమారుడు సాయినిఖిల్ ఫిర్యాదు మేరకు మణికంఠపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్‌ల దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

చర్ల: ద్విచక్రవాహనాల అపహరణకు పాల్పడుతున్న వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ ఏ.రాజువర్మ కథనం ప్రకారం.. దుమ్ముగూడెం మండలంలోని పైడిగూడెం గ్రామానికి చెందిన కనితి నాగేశ్వరరావు జల్సాలకు అలవాటు పడి ద్విచక్రవాహనాలను అపహరిస్తున్నాడు. ఇతనిపై జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో 20కు పైగా కేసులు నమోదయ్యాయి. సోమవారం ఉదయం చర్లలోని బస్టాండ్ సెంటర్‌లో వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు అనుమానాస్పదంగా కనిపించిన నాగేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు. విచారించగా ద్విచక్రవాహనాలను అపహరిస్తున్నట్లు తెలిపాడు. చోరీ చేసిన మూడు బైక్‌లు స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పూరిల్లు దగ్ధం

అశ్వారావుపేటరూరల్: ప్రమాదవశాత్తు ఓ పూరిల్లు పూర్తిగా దగ్ధమైన ఘటన సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని మెరుపు కాలనీకి చెందిన పొట్టెళ్ల పోలయ్య ఇంట్లో కుమార్తె గ్యాస్‌పై వంట చేస్తుండగా, ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. భయంతో ఆమె బయటకు పరుగులు తీయగా, క్షణాల్లోనే మంటలు వ్యాపించి పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న రూ.80 వేల నగదు, రెండు బంగారు చెవిదిద్దులు, రెండు జతల పట్టీలు, ఉంగరం, బ్యాంకుకు సంబంధించిన బాండ్లతోపాటు ఇంట్లో ఉన్న సామగ్రి కాలిపోయాయి. సమాచారం అందుకున్న స్థానిక అగ్నిమాపక శాఖ అధికారుల ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కాగా బాధిత కుటుంబీకులు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు.



మంటల్లో కాలిపోతున్న పూరిల్లు

చోరీ కేసు నమోదు



పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

దమ్మపేట: తాళం పగులగొట్టి ఇంట్లోని బంగారు ఆభరణాలను దొంగిలించిన సంఘటన మండల కేంద్రంలోని బోసు బొమ్మ సెంటర్‌లో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... దమ్మపేట గ్రామంలోని బోసు బొమ్మ సెంటర్‌లో నివాసం ఉంటున్న భూక్యా నాగేంద్రబాబు కుటుంబంతో కలిసి వ్యక్తిగత పనుల మీద ఆదివారం ఊరికి వెళ్లారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో దాచి ఉంచిన రూ. 74,250 విలువైన 33 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు. కాగా కొత్తగూడెం క్లూస్ టీం ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆధారాలు సేకరించారు.

మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ

కొత్తగూడెంఅర్బన్: మంచినీళ్లు తాగేందుకు ఇంట్లోకి వచ్చి, మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కొని దొంగ పరారయ్యాడు. బాధితురాలి కథనం ప్రకారం.. కొత్తగూడెం గాజులరాజంబస్తీకి చెందిన భారతి సోమవారం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో ఆమెను అనుసరించిన గుర్తు తెలియని వ్యక్తి, ఇంట్లోకి వెళ్లి మంచినీళ్లు అడిగి తాగాడు. అనంతరం భారతి మెడలోని మూడున్నర తులాల బంగారు చైన్‌ను లాక్కుని పారిపోతుండగా, అదే సమయంలో అటు వైపు వెళ్తున్న జర్నలిస్టు కొట్టే శివకుమార్, స్థానికులు పట్టుకున్నారు. గొలుసు తీసుకుని బాధితురాలికి అప్పగిస్తున్న క్రమంలో దొంగ అక్కడి నుంచి ఉడాయించాడు.

దాడి ఘటనలో కేసు నమోదు

దమ్మపేట : భౌతిక దాడికి పాల్పడిన ఘటనలో తొమ్మిది మంది వ్యక్తులపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని జమేదారుబంజర గ్రామానికి చెందిన సున్నం రాజులుకు అదే గ్రామంలో వ్యవసాయ భూమి ఉంది. అదే గ్రామానికి చెందిన వాడే గణేష్‌కు, రాజులుకు ఆ భూమి విషయంలో కొంతకాలంగా వివాదం నడుస్తోంది. సోమవారం ఎనిమిది మంది వ్యక్తులతోపాటు వ్యవసాయ భూమిలోకి ప్రవేశించిన గణేష్.. రాజులుపై భౌతిక దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

పందెంరాయుళ్ల అరెస్ట్

అశ్వారావుపేటరూరల్: మండలంలోని దురదపాడు గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రెండు కోడి పుంజులు, రూ.1500నగదు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీరాముల శ్రీను తెలిపారు.